క్లుప్తంగా

రేపటి నుంచి వీరనాగమ్మ ఆలయంలో ఉత్సవాలు



ముస్తాబైన ఆలయం

కేశంపేట: ఆరెకటిక కులదేవత వీర నాగమ్మ ఆలయంలో గురువారం నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలోని వీర నాగమ్మ దేవాలయంలో ఈ నెల 15వ తేదీ గురువారం కంకణధారణ, పుట్ట మట్టితో పూజ, దుర్మలయ్య పూజ, పోలుదారం చుట్టుట, 16వ తేదీ వీరనాగమ్మ ఉత్సవ విగ్రహ ఊరేగింపు, గంగపూజ అనంతరం కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు, ఆరెకటిక సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఫాతిమామాత చర్చి వార్షికోత్సవం



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమాపూర్ గ్రామంలో ఉన్న ఫాతిమామాత చర్చి వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తమిళనాడు, కేరళ, హైద్రాబాద్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బిషప్ అంథోని చర్చి, ఫాతిమామాత ప్రాముఖ్యత గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ సైమన్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు దిలీప్ రెడ్డి, మల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, చార్లీస్ రెడ్డి, స్థానికులు ఆల్ఫ్రెన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, లూర్థురెడ్డి, బాల్‌శౌరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొగిలిగిద్ద కళాశాలకు అటెండర్ నియామకం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అధికారులు అటెండర్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డి, కళాశాల విద్యా కమిషన్, కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా గత జనవరిలో మొగిలిగిద్ద పర్యటనకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కళాశాల సమస్యలను తీసుకెళ్లారు. దీంతో కళాశాలకు రెగ్యులర్ అటెండర్‌ను అధికారులు కేటాయించడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఎరుకలి ముత్తమ్మ మంగళవారం మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గుండ్రాతి రమణయ్యగౌడ్ రూ.5వేల చొప్పున మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన కడియాల వెంకటయ్య మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం వారు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం కుటుంబ సభ్యులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో రమణయ్యగౌడ్, పాండుగౌడ్, హరికిషన్‌రెడ్డి, అంజనేయులు, రవి, చెన్నయ్య, చంటి, ఉజ్వల్, అనసూయ, పోశయ్య, గణేష్, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని.. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కడ్తాల్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు అరుణ అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న విద్యాబోధన, మౌలిక వసతులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు మెరుగైన బోధన చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేరే విద్యార్థుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి పాల్గొన్నారు.



బాకారం సమీపంలో గుంతలమయంగా..



కాశీంబౌలి సమీపంలో అధ్వానంగా..

అధ్వాన రోడ్లతో అవస్థలు

- ఏళ్ల తరబడి మరమ్మతులు శూన్యం
- గుంతలు, కంకర తేలిన దారులపై వాహనదారుల నరకయాతన
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల రోడ్లన్నీ అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఈ రోడ్లపై రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. చాలా ఏళ్లుగా రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలు పడి, కంకర తేలడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తున్నారు. పలు గ్రామాల రోడ్లకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్లు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయాలుగా..

మండలంలోని అమ్డాపూర్-కాశీంబౌలి, కాశీంబౌలి-బాకారం గ్రామాల రోడ్లు కంకర తేలి, భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా తయారయ్యాయి. ప్రయాణిలు రాత్రి వేళల్లో గుంతల్లో పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో దారులన్నీ అధ్వానంగా మారాయని ఆరోపిస్తున్నారు. అమ్డాపూర్-కాశీంబౌలి-బాకారం రోడ్డుకు గతంలో 36 లక్షల నిధులు బీటీ కోసం మంజూరయ్యాయి. నిధులు మంజూరై దాదాపు సంవత్సరం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోని రోడ్డు పనులు ప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు.

నరకయాతన పడుతున్నాం



మండల పరిధిలోని కాశీంబౌలి-బాకారం, అమ్డాపూర్-కాశీంబౌలి రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడి నరకయాతన పడుతున్నాం. నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం బాధాకరం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇప్పటికైనా రోడ్డు పనులు ప్రారంభించాలి.

– మాడి వెంకట్‌రెడ్డి, కాశీంబౌలి

ప్రమాదాలు జరుగుతున్నాయి



బాకారం-కాశీంబౌలి రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారింది. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. బాకారం-కాశీంబౌలి గ్రామాలను కలుపుతూ ఉన్న బీటీరోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించేందుకు కృషి చేయాలి.

– ఎలిగని వెంకటేశ్‌గౌడ్, బాకారం

కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

మండల పరిధిలోని బాకారం-కాశీంబౌలి, కాశీంబౌలి-అమ్డాపూర్ రోడ్డుకు నిధులు మంజూరైన మాట నిజమే. కానీ కాంట్రాక్టర్లు రావడం లేదు. టెండర్లు పిలిచిన పనులు చేసేందుకు వెనుకాడుతున్నారు. కాంట్రాక్టర్లు ముందుకు రాగానే రోడ్డు పనులు ప్రారంభించేందుకు కృషిచేస్తాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రెవెన్యూ అధికారులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా కొందుర్గును పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో ఎంతో మంది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, వారి ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రాన్ని నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతీ రైతుకు ప్రభుత్వం త్వరలో భూ ఆధార్ కార్డును అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, నాయకులు కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, లింగం, మాసయ్య, రామకృష్ణ, కరుణాకర్‌రెడ్డి, యాదయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు

విడతల వారీగా వార్డులను అభివృద్ధి చేస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: మున్సిపాలిటీలో ఉన్న అన్ని వార్డుల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం 1వ వార్డులో మున్సిపల్ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసినట్లు వివరించారు. నిధుల లభ్యతను బట్టి వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు మాదారం నర్సింలుగౌడ్, మాధవి, కోస్గి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌యాదవ్, గోపాల్‌గౌడ్, శ్రీను, రాజు, యాదయ్య, జనార్ధన్‌చారి తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

వేసవి దుక్కులతో భూసారం పెంపు

జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ప్రగతికుమారి, రవీందర్

మొయినాబాద్‌రూరల్: వేసవి దుక్కులతో భూసారం పెరుగుతుందని, రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రగతికుమారి, డాక్టర్ రవీందర్, పీహెచ్‌డీ వ్యవసాయ విద్యార్థి వందన పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వేసవి దుక్కులతో భూమి సారవంతంగా మారుతుందని, భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుందని తెలిపారు. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుందన్నారు. లోతుదుక్కులు దున్నే ముందు పశువుల పెంట, పోగు, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంట దిగుబడి పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా పంట మార్పిడి చేయడంతో లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎఫ్ అధికారి వినయ్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డా.రవీందర్

సమస్యల పరిష్కారానికి కృషి



రోడ్డు సమస్యపై ఎమ్మెల్యేను కలిసి వివరిస్తున్న కాలనీవాసులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలోని వీరభద్ర కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు రోడ్డు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాలనీలోని యాక్సిస్ బ్యాంక్ నుంచి మైసమ్మ ఆలయం వరకు సీసీరోడ్డుకు కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తానన్నారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు ఆదేశిస్తానని కాలనీ ప్రజలకు చెప్పారు. అడిగిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2009–10వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హిమాయత్‌నగర్ సమీపంలోని ఓ ఫాంహౌజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారందరూ ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని, ఆటాపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజుబాబు, అంజయ్య, కృష్ణారెడ్డి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యకు ఇరవై కిలోమీటర్లు



కడ్తాల్ మండల కేంద్రం

- ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- దూరభారంతో పదో తరగతితో ఆపేస్తున్న వైనం
- ఎన్నికల హామీగానే మిగులుతున్న కళాశాల ఏర్పాటు

కడ్తాల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఏళ్ల నుంచి ఎదురుచూపులు తప్పడం లేదు. నూతనంగా ఏర్పడిన మండల కేంద్రంలో కళాశాల లేక ఇక్కడి పేద నిరుపేదలు పదోతరగతికే పరిమితమవుతున్నారు. ప్రైవేట్ కళాశాలలున్నప్పటికీ ఫీజుల భారంతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. సమీపం మండల కేంద్రం ఆమనగల్లులో ప్రభుత్వ కళాశాల ఉన్నప్పటికీ 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిందే. ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఎన్నికల వాగ్దానంగానే మిగిలిపోతోంది.

ఏటా ఆరు వందల మంది విద్యార్థులు

మండల కేంద్రంలోని రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు, కేజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రతి ఏటా సుమారు 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. వీటితో పాటు నాలుగైదు ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో 200మంది వరకు విద్యార్థులు ప్రతి ఏటా పదోతరగతి పరీక్షకు హాజరవుతారు. రావిచేడ్, ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ గ్రామాల్లోనూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండల కేంద్రంతో పాటు పరిధిలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలో ప్రతీ సంవత్సరం సుమారు 500నుండి 600 మంది వరకు విద్యార్థులు పదోతరగతి అభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల లేక

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక ఏటా వందలాది మంది విద్యార్థులు ఇంటర్ విద్యకు స్వస్తి పలుకుతున్నారు. పలువురు సమీప పట్టణాల్లోని ప్రైవేట్ కళాశాలలతో పాటు, కందుకూరు, తుక్కుగూడ, కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల లేక ప్రవేట్ కళాశాలలో ఫీజులు కట్టి చదువుతున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

త్వరలో ఉద్యమం



మండల కేంద్రంలో కళాశాల ఏర్పాటు చేయాల్సిందే. ఇందుకు పలుమార్లు ఆందోళనలు చేపట్టాం. ప్రభుత్వాల్లో చలనం లేదు. ప్రభుత్వ కళాశాల సాధనకు విద్యార్థి సంఘాలతో కలసి త్వరలోనే ఐక్య ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం.

– క్యామ శ్రీకాంత్, ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు, కడ్తాల్

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



మండల కేంద్రంలోప్రభుత్వ ఇంటర్ కళాశాల లేక నిరుపేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత చదువుకు దూరమవుతున్నారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– లాయక్‌అలీ, బీఆర్ఎస్ నాయకుడు, కడ్తాల్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవశ్యకతను ఎమ్మెల్యేకు వివరించాం. ఎమ్మె ల్యే సైతం సమస్యను ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలి. – జి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు, కడ్తాల్

ఆయిల్‌పామ్ సాగును సద్వినియోగం చేసుకోవాలి


చేవెళ్ల డివిజన్ ఉద్యాన అధికారి కీర్తికృష్ణ

చేవెళ్ల: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీతో పాటు పూర్తి సహకారం అందిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల డివిజన్ ఉద్యాన అధికారి కీర్తికృష్ణ అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం వాణిజ్య పంటల సాగు అయిన ఆయిల్‌పామ్‌కు ప్రాధాన్యత అందిస్తుందని తెలిపారు. ఎకరానికి కావాల్సిన 50 మొక్కలకు ప్రభుత్వం 8,650 సబ్సిడీని అందిస్తుందని, ఒక మొక్క ధర 193 రూపాయలు ఉంటే రైతు కేవలం 20 రూపాయలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ ఆయిల్‌పామ్‌లో అంతర్ పంటకుగాను 4 సంవత్సరాల వరకు సంవత్సరానికి ఎకరానికి 4,200 రాయితీని కూడా అందిస్తుందన్నారు. దీంతో పాటు డ్రిప్ పరికరాలపై 12 ఎకరాల వరకు రాయితీని ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీసీ, ఓసీలకు 5 ఎకరాల వరకు 90శాతం రాయితీని కల్పిస్తుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు ముందుకు రావాలని కోరారు. చేవెళ్ల నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే అధికారి కీర్తికృష్ణ 8977714222, షాబాద్ ఫీల్డ్ అధికారి రాకేశ్‌కుమార్ 8712636492, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాలకు సంబంధించిన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, 8712636483ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

అబ్దుల్లాపూర్‌మెట్: వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ పరిధి గౌరెల్లిలో కొలువైన శ్రీ స్వయంభూ స్వర్ణగిరి లక్ష్మీనర్సింహాస్వామి వార్షికోత్సవం వైభవోపేతంగా సాగింది. సోమవారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ క్రతువును వీక్షించడానికి గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తండోపతండాలుగా విచ్చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపం జనసంద్రంతో కిక్కిరిసింది. ఆలయ అర్చకుడు గోవర్ధనం ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం కొనసాగింది. భక్తుల జయ జయ ధ్వనులతో మాలాధారణ ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మన్ చెంచల శ్రీనివాస్, డైరెక్టర్లు దివ్యదాస్, రాజు, రాజేశ్, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులు